గౌతమీ ప్రజా వైద్యశాల ఫోన్ : 53737

## డాక్టర్ సుంకుబలరామ్

L.A.M.& S. (మదనపల్లి- డాక్టర్)

డాక్టర్ జయసూర్యమార్గ్, రామకోటి,

హైదరాబాద్-500 001

### మా క్యాంపుల వివరములు

| | | | |
|---|---|---|---|
| 1, 16వ తేదీ ఒంగోలు | : గౌతమీ నర్సింగ్ హోమ్, తాతా బిల్డింగ్స్, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద | ఉ॥7 30నుండి ఉ॥ 9 30 | |
| 1వ తేదీ గుంటూరు | : కన్యకాపరమేశ్వరీ ఆలయములో | ఉ॥8గం॥ నుండి మ॥ 2 గం | |
| 1వ తేదీ విజయవాడ | : శ్రీ బృందావన్ లాడ్జిలో | సా॥ 5 గం నుండి రా॥ 8 గం | |
| 2వ తేదీ గుడివాడ | : జిల్లా పరిషత్ బంగళాలో | ఉ॥ 8 గం నుండి మ॥ 12 గం | |
| 2వ తేదీ ఏలూరు | : శ్రీఆంజనేయస్వామి ధర్మశాల | మ॥ 1 గం నుండి 2-30 గం | |
| 2వ తేదీ రాజమండ్రి | : హోటల్ అప్సర | సా॥ 6 గం నుండి రా॥ 9 గం | |
| 3వ తేదీ విశాఖపట్నం | : హోటల్ మనోరమ | ఉ॥ 10 గం నుండి మ॥ 2 గం | |
| 4వ తేదీ ఖమ్మం | : మయూరాలాడ్జి | ఉ॥ 8 గం నుండి మ॥ 2 గం | |
| 10వ తేదీ చిలకలూరిపేట | : గంగాభవన్ లాడ్జి | మ॥ 1 గం నుండి మ॥ 3 గం | |
| 25వ తేదీ నర్సారావుపేట | : శ్రీనివాసాలాడ్జి | సా॥ 3 గం నుండి రా॥ 6 గం | |
| 14వ తేదీ అనంతపురం | : బృందావన్ లాడ్జి | ఉ॥ 8 గం నుండి మ॥ 12 గం | |
| 15వ తేదీ తిరుపతి | : హోటల్ విక్రం | ఉ॥ 8 గం నుండి మ॥ 12 గం | |
| 15వ తేదీ పలమనేరు | : ఆర్. అండ్ బి. ట్రావెలర్స్ బంగళా | సా॥4గం నుండి 6 గం | |

N,B, :- ప్రతి నెల తేదీ 1.2,3,4,10,14 15 25,
మినహా మిగతా తేదీలలో డాక్టర్ గారు
హైదరాబాదులో వుంటారు.



# పెద్దచేప

## మోదుకూరి జితేంద్ర శర్మ

బ్యాంక్ మేనేజర్ గొంతు వినయంగా పలికింది ఫోన్‌లో.

"వాట్ కెన్ అయ్ డూ ఫర్ యూ సర్?"

"చిన్న ట్రబుల్" అన్నాను. వీలైనంత విచారం గొంతులో ధ్వనింపజేస్తూ "చెక్ బుక్ డ్రాయర్ తాళం యింట్లో మర్చిపోయాను. పార్టీలు వచ్చారు. డబ్బు కట్టాలి. గుమాస్తాని పంపుతున్నాను, లెటర్‌తో. డబ్బు పంపండి. రేపు చెక్ పంపుతాను. యివేళ మరి యింటికి వెళ్ళి తాళం తెప్పించే సమయంలేదు. మరో అరగంటలో మూసేస్తారు మీరు. సారీ ఫర్ ది ట్రబుల్."

"దానికేముంది సర్! అలాగే పంపండి. రేపటి చెక్ మీద యివేళటి తేదీ వెయ్యడం మర్చిపోకండి." అన్నాడతను.

"చాలా థాంక్స్! ఈసారి మంచి పార్టీ యిస్తాను మీకు" అన్నాను ఫోన్ పెట్టేస్తూ.

గిరి సందేహంగా నావైపు చూస్తున్నాడు.

"ఓకే గిరి. పది నిమిషాలాగి వెళ్ళు." అన్నాను.

యిద్దరం ఎదురుగా ఉన్న కాఫీబార్‌లో దూరాం.

ఆ ఫోన్ నిజంగా నా పేరు మీద చెయ్యలేదు. నేను 'పూనా' లోని ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త తిరుపుడే పేరుమీద చేసేను. తిరుపుడే దగ్గిర పనిచేశాను కనక తిరుపుడే పేరు ప్రఖ్యాతులు నాకుతెలుసు. తిరుపుడేతో బిజినెస్ చాలా ముఖ్యం కర్వేరోడ్‌లో ఉన్న ఆ బాంక్‌కి, పూనాలో చాలా బాంక్‌లకు యిది అలవాటే. వారికి ముఖ్యమైన కష్టమర్లకి యిటువంటి సహాయాలు చేస్తారు వాళ్ళు. లెటర్ పంపకుండా ఫోన్ మాటమీదే డబ్బుయిస్తారు తిరుపుడేకి. కానీ నేనేం ఛాన్సెస్ తీసకోదలుచుకోలేదు.

పది నిముషాలు గడిచేక గిరి వెళ్ళాడు ఆ బాంక్‌కి. డక్కన్ జిమ్‌ఖానా నుంచి కర్వేరోడ్‌లో ఉన్న ఆ బాంక్‌కి ఆటోలో అయిదు నిముషాల ప్రయాణం సుమారుగా. టైమ్ ఫాక్టర్‌ని అమలు పరచటం మరిచిపోలేదు నేను.

నలభై వేల రూపాయలు కావాలి అని తిరుపుడే రాసినట్లుగా ఓ ఉత్తరం టైప్ చేసి గిరిచేత పంపాను. ఫోన్ చెయ్యకుండా ఒక్క ఉత్తరమే పంపితే బాంక్ మేనేజర్‌కి అనుమానమొచ్చి క్లారిఫికేషన్ కోసం తిరుపుడేకి ఫోను చేయవచ్చు. అందుకని ముందుగా ఫోన్ చేసేను.

# డైరీ

నా సుందరమైన డైరీలో
మున్నూటా అరవై ఐదు
దుఃఖాలు........

విద్యారణ్య కామ్లేకర్

అతని కంపెనీలో పనిచేస్తున్నపుడు తిర్పుడేకి ఈ విధంగా చాలాసార్లు నాచేత డబ్బులు తెప్పించుకొనేవాడు. అది యిపుడు నాకు బాగా ఉపయోగించింది.

బాగా ఆలోచించి ఓ పథకం వేస్తే సాగని దేదీ లేదీ ప్రపంచంలో.

అరగంట వెయిట్ చేసాక గిరివచ్చాడు. నవ్వు ముఖంతో. గిరి మొఖం చూస్తూనే పోల్చేసేను వెళ్ళిన పని సవ్యంగా జరిగి పోయింది అని. వెంటనే ఆటో ఎక్కి ముందు వాలో ఉన్న నా రూంకి వెళ్ళి పోయేను. తిర్పుడే కంపెనీ చాంబే-పూనా రోడ్‌లో ఉంది. దార్లో రెండు ఆటోలు మారేం.

యింటికి వెళ్ళాక గిరితో అన్నాను. "యీ గడ్డం మీసం తీసేయ్. క్రాఫ్ బాగా దగ్గిరగా చేయించుకో. క్విక్."

"నా డబ్బులో!" అన్నాడు గిరి చెయ్యి చాపుతూ.

నాలుగు వేల రూపాయలు లెక్కపెట్టి యిచ్చాను గిరికి. ముప్పై ఆరువేల రూపాయలు యిపుడు నాకు లాభం.

రేపు తిర్పుడే ముఖం చూడాలి బాంక్ మేనేజర్ చెక్ కోసం కబురు చేసినపుడు.

బాస్టర్డ్!

కసి తీర్చుకున్నాను యిన్నాళ్ళకి తిర్పుడే మీద.

సంతకాలు, తమాషాగా ఉన్న సంతకాలు ప్రాక్టీస్ చెయ్యడం ఓ హాబీ నాకు. తిర్పుడే సంతకం ప్రాక్టీస్ చేస్తూ తిర్పుడేకి దొరికి పోయాను. అతని కంపెనీలో పని చేస్తున్నా నపుడు.

అపుడేం అనలేదు. చిన్నగా మందలించి ఊరుకున్నాడు.

రెండు రోజులు తరువాత సోంవార్ పేట్‌లో ఉన్న నా రూంకి వచ్చారు పోలీసులు. ఫోర్జరీ నేరం కింద అరెస్ట్ చేసారు.

సంవత్సరంన్నర క్రితం జరిగింది ఆ సంఘటన.

ఏం జరిగిందో తరువాత కోర్ట్‌లో అర్థం అయింది.

నేను సంతకాలు ప్రాక్టీస్ చేస్తున్నపుడు తిర్పుడే మెదడులో వెలిగి ఉండాలి ఆ ఉపాయం. పాతిక వేల రూపాయలకు ఓ చెక్ రాసి నా చేత తెప్పించేడు డబ్బుని. మరునాడు తన చెక్ బుక్‌లో ఓ ఫోలియో పోయిందని, ఆనర్ చెయ్యవద్దనీ బాంక్‌కి రిపోర్ట్ చేసేడు. బాంక్ మేనేజ్‌మెంట్ వెంటనే నా మీద పోలీస్ కంప్లెయింట్ చేసేరు. కోర్టులో నేను సంతకాలు చేసిన రఫ్ పేపర్ సబ్‌మిట్ చేసేడు ఎవిడెన్స్ క్రింద పబ్లిక్ ప్రాసిక్యూటర్. నాచేత తిర్పుడే సంతకం చేయించాడు. కోర్టులో నేరం ఋజువు అయిపోయింది.

సంవత్సరం శిక్ష పడింది నాకు. డబ్బు కట్టలేక పోయినా మొదటి తప్పిదం కనుక తక్కువ శిక్ష వేస్తున్నానని మందలించి పంపేశాడు జడ్జి.

జైల్ నుండి బయటికి వచ్చాక, ఉద్యోగం కోసం తిరుగుతుంటే ఆ ఆలోచన స్ఫురించింది.

తన లాభం కోసం నన్ను ఎరగా ఉపయోగించుకున్నాడు తిర్పుడే. అతనికి గుణపాఠం ఎందుకు చెప్పకూడదు.





ఎస్! ఎందుకు చెప్పకూడదు?

తిర్పుడే సంతకం నాకు కొట్టిన పిండి. అయితే నేరం జరిగిన వెంటనే పోలీసులు నన్ను అనుమానిస్తారు కనక ఎలిబీ చూసుకోవాలి నేను.

బాంబేదగ్గర కళ్యాణ్‌లో నాచిన్నాన్న

కొడుకు ఉన్నాడు. వాడి దగ్గరకు ఉదయం దక్కన్‌లో వెళ్ళాను. తొమ్మిదికి కార్లో తన కంపెనీకి వెళ్ళిపోతాడు. ఆవేళంతా ఉంటానని చెప్పి వెళ్ళిపోయాక మళ్ళీ వెనక్కి పూనా వచ్చేశు.

గిరిని పోలీసులు ట్రాప్ చేసి పట్టుకొన్నా, నా సంగతి తెలీదు గిరికి. అందుకని గిరిని యిన్ఫర్మేషన్ లాగలేదెవరూ!

గిరిని పంపేశాక మళ్ళీ కళ్యాణ్ వెళ్ళిపోయాను. రాత్రి ఎనిమిదింటి వరకూ మా చిన్నాన కొడుక్కి తెలీదు. ఆ మధ్య కాలంలో నేను ఏం చేసినది అయినా చెప్పాలి. చెప్పేస్తే కావలసిన ఎలిబీ వాడిస్తాడు.

తిర్పుడే మీద కసి తీర్చుకున్నానన్న సంతృప్తితో వెళ్ళిపోయాను కళ్యాణ్.

రాత్రి వాడు రాగానే చెప్పాను. జరిగిందంతా.

"నీక్కావలసిన ఎలిబీ నేను యిస్తాను. భయపడక!" అన్నాడు.

అప్టరాల్ - ఈ ప్రపంచం అంతా పెద్ద చేప-చిన్న చేపని తింటూ బ్రతుకుతోంది.

ఆ రాత్రి సంతృప్తిగా నిద్రపోయాను.

ఓ ఓ ఓ

వారంరోజులు గడవక ముందే వచ్చారు పోలీసులు నన్ను వెతుక్కుంటూ.

కళ్యాణ్‌లోని నా చిన్నాన కొడుకు గదిలో పడుకున్నాను ఆదే సమయానికి.

ముప్ఫయారువేల రూపాయలూ యింకా ఖర్చు పెట్టలేదు. ఒకవేళ ఆ నోట్ల నెంబర్స్ ఆ బాంక్ వాళ్ళు గుర్తుపెట్టుకొన్నారేమో అన్న భయంతో.

తలుపు మీద టక టక మని శబ్దం అవుతుంటే నా చిన్నాన కొడుకేమోనని తలుపు తీసి, పోలీసుల్ని చూసి ఆశ్చర్యపోయాను.

నన్ను అరెస్ట్ చేసి ఆగదంతా సోదా చేసేరు. చాలా సులువుగానే దొరికి పోయింది ఆ డబ్బు.

స్టేషన్‌లో యిన్స్పెక్టర్ అడిగాడు ఆ డబ్బు లెక్క పెట్టాక.

"మిగిలిన తొంభై వేలు ఏంచేసేవ్?"

ఆశ్చర్య పోయ్యాను. "తొంభై వేలా?"

"అవును. గుప్తే పేరుమీద ఫోర్జరీ చేసి బాంక్‌లోంచి విత్‌డ్రా చేసిన లక్షా, యిరవై అయిదు వేలలో మిగిలిన ఎనభై తొమ్మిది వేలు రూపాయలు. ఏం చేసేవ్? ఎక్కడ దాచేవ్?"

కొద్ది కొద్దిగా అర్థమవుతోంది నాకు.

తిర్పుడే పేరు మీద నేను ఫోర్జరీ చేసి ఉండాలి, ఆ నేరం నా మీదకి ఎలా వచ్చిందో అంతు పట్టలేదు.

"నేను ఫోర్జరీ చెయ్యలేదు. అసలు గుప్తే ఎవరో నాకు తెలీదు." అన్నాను నీరసంగా.

"సరే! నీకు గుప్తే తెలియదు. ఈ డబ్బెలా వచ్చింది నీకు?" అడిగాడు.

సమాధానం చెప్పలేరు నేను. తిర్పుడే సంతకం ఫోర్జరీ చేస్తే ఆ డబ్బు నా దగ్గర ఉందని చెప్పలేను కనుక.

"ఎలా వచ్చాయ్!?" గద్దిస్తూ అడిగాడు.

"లాటరీలో" అప్రయత్నంగా అన్నాను

"అబద్ధం." గట్టిగా అరుస్తూ బల్ల మీద కొట్టాడు ఆ ఇన్స్పెక్టర్. "గుప్తే పేరు సంతకం ఫోర్జరీ చేసి లక్షా యిరవై అయిదు వేలు కాజేసేవ్ నువు. ముందుగా గుప్తే ఫోన్ చేసినట్లు చేసి, తరువాత లెటర్ పట్టుకొని వెళ్ళి డబ్బు తీసుకున్నావ్! గుప్తే అలవాటు అది. ఆ! నీకు తెలుసు. బాంక్ వాళ్ళకూ అది మామూలే. ఆ బాంక్‌కి చాలా ముఖ్యమైన కస్టమర్ గుప్తే కనుక నిన్ను అనుమానించక యిచ్చేసేరు డబ్బుని తరువాత గంటకి గుప్తే వెళ్ళాడు ఆ బాంక్‌కి. అపుడు తెలిసింది ఆ లెటర్ గుప్తే పంప లేదని, ఆ బాంక్‌ని నువు మోసం చేసేవని, నీ వివరాలు కేషియర్ చెప్పారు. ఎక్కడ మిగిలిన సొమ్ము?"

తత్తరపాటుతో సమాధానం చెప్పలేదు నేను.

"లేదు. నాకు తెలీదు." అయోమయంగా.

"నీలాటివాళ్ళు ఎలా చెప్తారో నాకు తెలుసు" అన్నాడు లాఠీ పట్టుకొని లేస్తూ.

సుమారు రెండు గంటలసేపు నానా రకాలుగా హింసించాడు నన్ను. చివరికి సెల్‌లో కూలేశారు.

ఓ ఓ ఓ

రెండు రోజుల ప్రొసీడింగ్స్ తరువాత అయిదు సంవత్సరాల శిక్ష విధించేసు జడ్జి కోర్ట్‌లో.

బాంక్ క్లర్క్ చెప్పాడు నన్ను గుర్తించి, ఆవేళ నేనే గుప్త పేరు మీద ఆ డబ్బు విత్‌డ్రా చేసినట్లు.

నాకు ఎలిబీ మా చిన్నాన కొడుకు యివ్వలేదు. ఒంటరిగా ఆవేళ రూంలో వదిలేసి బాంద్రా వెళ్ళేనని ఆ సమయంలో నేనేంచేసినా తనకు తెలీదని అన్నాడు కోర్టులో.

తిర్పుడే సంతకం ఫోర్జరీ చేసి ఒకసారి అరెస్ట్ అయాను కనుక నేనే నేరం చేయలేదన్నా నమ్మలేదు జడ్జి.

నెలరోజులు గడిచేయ్ జైల్లో.

ఓ రోజు చిన్నాన కొడుకు వచ్చాడు నా దగ్గరికి.

"మన గ్రామం వెళ్ళి పోతున్నాను. అక్కడ ఓ చిన్న ఇండస్ట్రీ పెట్టాలనుకుంటున్నాను" అన్నాడు మాటల్లో.

"డబ్బు ఎక్కడిది?" అడిగాను.

"నిజానికి నీకు చెప్పాలి థాంక్స్. నాకో చక్కని ఆలోచన యిచ్చినందుకు." అన్నాడు, చిన్నగా నవ్వుతూ.

"నాకా? థాంక్స్? ఎందుకూ?" అడిగాను.

"అవును, తిర్పుడే సంతకం ఫోర్జరీ చేసి బాంక్‌లో డబ్బు కొట్టేసిన నీ విధానం బాగా నచ్చింది నాకు. సాధారణంగా బొంబే, చుట్టుపట్ల ఉన్న యిండస్ట్రీ ఓనర్సందరికీ అదే అలవాటు ఉంటుంది.

నీకు తెలీదు నేను గుప్తే దగ్గర పని చేస్తున్నట్లు, అతని సంతకం అనుకరించే అలవాటున్నట్లు. గుప్తే సంతకం నాకు కొట్టిన పిండి. అంత వరకూ, అంటే నువు నీ నేరం చెప్పేవరకు నాకా ఆలోచన లేదు. వచ్చిన తరువాత ఆలోచన చేయలేదు. అయితే నేరం నా మీదకి రాకుండా ఉండేందుకు నిన్ను ఎరగా ఉపయోగించవలసి వచ్చింది. అందుకు బాంక్ కేషియర్‌కి కొంచెం లంచం యిచ్చేను, నీమీద నేరం ఋజువు పరిచేందుకు. నీకు చాలా థాంక్స్.—నిజానికి నువు ఆ ఆలోచన చెప్పకుండా ఉండి ఉంటే అసలు నా దగ్గరకు రాకుండా ఉండి ఉంటే, ఎప్పటికీ ఓ యిండస్ట్రీ ఓనర్‌ని కాలేకపోయివుందును జీవితంలో."

నాకు కోపం ఆగలేదు. చటుక్కున చేతులు కటకటాల్లోంచి చాపి వాడి పీక అందుకోబోయేను.

నా ఉద్దేశ్యం గ్రహించినట్లు ఒక అడుగు వెనుక్కి వేసేడు. "వద్దు. ఆ ఆలోచన మంచిది కాదు. శిక్ష పూర్తయ్యాక రా! ఉద్యోగం ఇస్తాను నా ఫేక్టరీలో. అప్టరాల్ ప్రపంచం అంతా చిన్న చేపని పెద్దచేప మింగడం అనే దోపిడి సూత్రంమీదే నడుస్తోంది కదా" అన్నాడు.

వెళ్ళిపోయాడు, నన్ను వదిలేసి. ■